# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం । 14 । మార్చి । 2026 పేజీలు: 5




### కామారెడ్డిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు

# కేంద్ర మంత్రికి వినతి

**– స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.**

కామారెడ్డి, మార్చి 13 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలో పారిశ్రామిక వాడ (ఇండస్ట్రియల్ కారిడార్) ఏర్పాటు చేయాలని కోరుతూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి దేశ రాజధాని న్యూ ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంతో పాటు 7 మండలాల్లో యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, విద్యావంతులైన యువతను భాగస్వామ్యం చేస్తే కామారెడ్డి ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు సహా ఇతర విభాగాలతో సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**– సీపీ సాయి చైతన్య**

2

# ఎల్పీజీ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేయాలి





**– పట్టణాల్లో 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి బుకింగ్ చేసుకోవాలి.**

**– జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు.**

**– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

కామారెడ్డి, మార్చి 13 ( మనం జిల్లా ప్రతినిధి ):

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లతో సమన్వయం చేసుకుని గ్యాస్ లభ్యతను పరిశీలించాలని సూచించారు. నిల్వ కేంద్రాలు, డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో స్టాక్ పరిస్థితిని ప్రతిరోజూ సమీక్షించడంతో పాటు నిల్వ, మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్, అనధికార వినియోగాన్ని కట్టడి చేయాలని తెలిపారు. అవసరమైతే ఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

**అదనపు ధరలు వసూలు చేయరాదు**

జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్

-మిగతా 2లో



### డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తోట

– పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేత.

2



### ఉద్రిక్తత మధ్య ముగిసిన మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి అంత్యక్రియలు

2



## ఎల్పీజీ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేయాలి

ఆదేశించారు. కమిటీకి కలెక్టర్ చైర్మన్గా, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కన్వీనర్గా ఉంటారని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, రవాణా, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్యా, సంక్షేమ శాఖలతో పాటు ఆయిల్ కంపెనీలు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. వినియోగదారుల నుంచి అదనపు ధరలు వసూలు చేయకుండా సిలిండర్లను సరిపడా అందుబాటులో ఉంచాలని డిస్ట్రిబ్యూటర్లకు సూచించారు. ఇక గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగించడం, నిల్వ చేయడం వంటి చర్యలను అరికట్టాలని, అలాంటి వారిపై ఎస్సెన్షియల్ కమోడిటీస్ చట్టం - 1955 సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**అపోహలకు తావులేదు: మంత్రి**

ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఎల్పీజీ కొరత ఉందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమెరికా - ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడిందన్న ప్రచారం అసత్యమని తెలిపారు. రాష్ట్రంలో 810 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా రోజుకు సుమారు 2.5 లక్షల సిలిండర్లు సరఫరా జరుగుతుండగా, కోటి 29 లక్షల కనెక్షన్లు ఉన్నాయని వివరించారు. అపోహలు సృష్టించి బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని, పట్టణాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- సీపీ సాయి చైతన్య.**

నిజామాబాద్, మార్చి 13 ( మనం బ్యూరో ): లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. చాలామంది ప్రజలు న్యాయ సంబంధిత సమస్యలను తేల్చుకోలేక ఇబ్బందులు పడుతుంటారని వారికి పరిష్కార మార్గం చూపిందుకే లోక్ అదాలత్ను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని సాయి చైతన్య పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించే జాతీయలోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు లోక్ అదాలత్లో పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్న కేసులను తక్కువ సమయంలోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు. దీనికి సంబంధించి పోలీస్శాఖ తరపున ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.



# ఉద్రిక్తత మధ్య ముగిసిన మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి అంత్యక్రియలు





ఇందల్వాయి, మార్చ్ 13 ( మనం న్యూస్ ): మండల కేంద్రంలోని లింగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి అంత్యక్రియలు తీవ్ర విషాదం మరియు ఉద్రిక్తతల మధ్య ముగిశాయి. గోపి హత్యతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, ముదిరాజ్ సంఘం నేతలు మరియు గ్రామస్తులు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిందితుల వెల్లడి కోసం ధర్నా చేశారు. హత్యకు పాల్పడిన నిందితుల పేర్లను పోలీసులు బహిర్గతం చేసే వరకు అంత్యక్రియలు జరిపించేది లేదని బాధితుడి బంధువులు రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితి విషమిస్తుండటంతో స్థానిక



ఎస్ఐ జి. సందీప్, సీఐ వినోద్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిరసనకారులతో చర్చలు జరిపిన అనంతరం, ఈ కేసులో ఆరుగురు నిందితుల పేర్లను పోలీసులు వెల్లడించినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వెల్లడించిన అనుమానితుల పేర్లు మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి మేనల్లుడు సతీష్ తో పాటు శ్రీధర్, రవి, ప్రశాంత్, దేవేందర్ తోపాటు మరొక్కరిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించి, బాధితుడి కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి అంత్యక్రియలకు అంగీకరించారు.

**తరలివచ్చిన జనసందోహం.**

ఇమ్మడి గోపి చివరి చూపు కోసం చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు, ముదిరాజ్ నాయకులు మరియు యువకులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ., సమాజం కోసం పనిచేసే నాయకుడిని పొట్టనబెట్టుకోవడం దుర్మార్గమని, ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తోట

**- పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేత.**

పిట్లం, మార్చి 13 ( మనం న్యూస్ ): పిట్లం మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి ఆశలు కల్పించి, జుక్కల్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వకుండా మోసం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిజంగా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేసే దిశగా




పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజంగా ఇల్లు అవసరమైన పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

**రంజాన్ తోఫా అందజేత.**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ తోఫా అందజేస్తున్నారని, అందులో భాగంగానే పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.






# బాలికలకు ఉచిత హెచ్ పి వి టీకా

- హెచ్ పి వి టీకా గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- బాన్సువాడ ఎం సి హెచ్, కామారెడ్డి జిజిహెచ్ లో అందుబాటు.
- 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు నిండని బాలికలకు హెచ్ పి వి టీకా.
- టీకా కోసం ఆధార్ వంటి ఐడి ప్రూఫ్, మొబైల్ నంబర్, తల్లిదండ్రుల సమ్మతి పత్రం అవసరం.



కామారెడ్డి, మార్చి 13 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లాలో బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్ పి వి (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ టీకాను ప్రస్తుతం బాన్సువాడ ఎం సి హెచ్ ఆసుపత్రి మరియు కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జిజిహెచ్)లో ఉచితంగా ఇస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ మహిళల్లో కనిపించే తీవ్రమైన వ్యాధి. పరిశోధనల ప్రకారం దాదాపు 99.7 శాతం కేసులు హెచ్ పి వి వైరస్ కారణంగా సంభవిస్తున్నాయి. ముఖ్యంగా హెచ్ పి వి టైప్-16, టైప్-18 వల్ల ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. వీటిని లక్ష్యంగా చేసుకుని రూపొందించిన గార్డసిల్ (క్వాడ్రివాలెంట్) వ్యాక్సిన్ రోగనిరోధక శక్తిని పెంచి భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ టీకా 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాలు నిండని బాలికలకు ఇవ్వడం అత్యంత ప్రభావవంతంగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక్క డోసు (0.5 మి.లీ) టీకా ఇవ్వడం ద్వారా కూడా దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందని వెల్లడించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చయ్యే ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. టీకా వివరాలు యు - విన్ డిజిటల్ ప్లాట్ఫార్మ్లో నమోదు చేస్తారు. టీకా వేయించేందుకు ఆధార్ వంటి ఐడి ప్రూఫ్, మొబైల్ నంబర్, తల్లిదండ్రుల సమ్మతి పత్రం అవసరం.

జిల్లాలోని తల్లిదండ్రులు తమ 14 సంవత్సరాల బాలికలను సమీపంలోని బాన్సువాడ ఎం సి హెచ్ లేదా కామారెడ్డి జిజిహెచ్ ఆసుపత్రులకు తీసుకువచ్చి ఉచిత హెచ్ పి వి టీకా వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.



## ఆడపిల్ల పెళ్లికి సర్పంచ్ చేయూత

**హామీ నిలబెట్టుకున్న గ్రామ సర్పంచ్ రెమ్మ భానుచందర్**

రెంజల్, మార్చి 13 ( మనం న్యూస్ ): రెంజల్ మండలంలోని కళ్యాపూర్ గ్రామం లో సర్పంచ్ ఎన్నికల సమయంలో భాగంగా అన్నయ్య కానుక గా 5116 రూపాయలను అందచేస్తానని ఇచ్చిన హామీ మేరకు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గ్రామ సర్పంచ్ రెమ్మ భానుచందర్ ఆడపిల్ల పెళ్లి సందర్భంగా ఆర్థిక సహాయం అందజేశారు. పెళ్లి కానుకగా రూపాయలు ఐదు వేల ఒక వందలను వధువు కుటుంబానికి అందించి తన మాటను నిలబెట్టుకున్నారు. గ్రామంలో ఆడపిల్లల పెళ్లిళ్లకు సహాయం చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను అమలు చేస్తూ సర్పంచ్ చేసిన ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మైని మోహన్ కూడా ముందుకు వచ్చి పుస్తె, మెట్టెలను కానుకగా అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. గ్రామంలో ఐక్యతకు నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలిచిందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెమ్మ భానుచందర్, మాజీ సర్పంచ్ మైని మోహన్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు కెఆర్కే సన్షైన్ ట్రస్ట్ ఇఫ్తార్ విందు

- ఇఫ్తార్ విందులో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు.
- మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఖాలీలుల్లా.

కామారెడ్డి, మార్చి 13 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలో కెఆర్కే సన్షైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థుల కోసం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఖాలీలుల్లా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సెంటర్లో గతంలో శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు పెద్దగా ఇఫ్తార్ విందులో భాగమయ్యారు. పూర్వ విద్యార్థులతో సత్సంబంధాలు కొనసాగించడంతో పాటు వారికి ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఖాలీలుల్లా మాట్లాడుతూ., యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని మంచి అవకాశాలు సాధించాలని, సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో 200 మందికి పైగా సభ్యులు హాజరయ్యారు. అనంతరం సమాజ శాంతి, అభివృద్ధి, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేశారు.




## భీంగల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



బాల్కొండ, మార్చి 13 ( మనం న్యూస్ ): బాల్కొండ నియోజకవర్గం భీమ్గల్ పట్టణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు సంచాలకులు పురపాలక పరిపాలనశాఖ ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మరియు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్ని వార్డులలో వార్డ్ ప్రజలకు తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే అన్ని వార్డులలో వార్డ్ కౌన్సిలర్లతో నిర్వహించడం జరిగింది. ఇంట్లో నీళ్లు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పట్టణంలోని గల మంచినీటి వాటర్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ తో క్లీనింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోదిరే నాగమణి స్వామి మరియు వైస్ చైర్ పర్సన్ సంటి లత నర్సయ్య, అన్ని వార్డ్ కౌన్సిలర్ మెప్మా సిబ్బంది మున్సిపల్ సిబ్బంది ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెంజల్ ప్రభుత్వ ఆసుపత్రికి వీల్ చైర్ విరాళం



రెంజల్, మార్చి 13 ( మనం న్యూస్ ): రెంజల్ మండల కేంద్రంలోని రెంజల్ ప్రభుత్వ ఆసుపత్రి కి రెంజల్ గ్రామవాసి, దాత ఇర్గరాజ్ గణేష్ వీల్ చెర్ను విరాళంగా అందజేశారు. రోగులకు సౌకర్యంగా ఉండేలా ఈ వీల్ చెర్ను ఆసుపత్రికి అందజేయడం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా రెంజల్ గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి మాట్లాడుతూ., దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు అందించడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. దాత ఇర్గరాజ్ గణేష్ చేసిన సేవను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానస రాకేష్, మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ పెద్ద ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి అధ్యక్షురాలుకి జన్మదిన శుభాకాంక్షలు



బాన్సువాడ, మార్చి 13 ( మనం న్యూస్ ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా బంజారా హిల్స్ నందినగర్ లోని స్వగృహంలో బాన్సువాడ మలి దశ ఉద్యమకారులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి చిత్ర పటం బహుమతి అందజేశారు. అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ., ఉద్యమకారుల హామీలను తీర్చేవరకు ఉద్యమకారులకు అండగా ఉంటానని, వారికి 250 గజాల ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, ఐడికార్డులు తదితర హామీలు అందజేసేవరకు ఉద్యమ కారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ గుప్త, జిల్లా మీడియా కన్వీనర్ దండు విజయ్ కుమార్, మండల అధ్యక్షులు గంజివారు చందు, చీదుర లీలాధర్, రాష్ట్ర నాయకులు శ్యామ అంజిరెడ్డి, మల్లూరి అనిల్ కుమార్ పలు ఉద్యమ సంఘాలు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



బాల్కొండ, మార్చి 13 ( మనం న్యూస్ ): భీంగల్ మండలంలో నేటి నుండి జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాశాఖ అధికారి డి.స్వామి తెలియజేశారు. భీమ్గల్ మండల పరిధిలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 704 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ భీంగల్, జెడ్ పి హెచ్ ఎస్ పల్లికొండ, జెడ్ పి హెచ్ఎస్ ముచ్కూర్ మరియు ప్రభుత్వ జూనియర్ కాలేజీ భీమ్గల్ లలో పరీక్ష కేంద్రాలు చేయడం జరిందని, పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఎంఈవోడి స్వామి పేర్కొన్నారు.

# టెక్రియాల్ చెరువు వద్ద శానిటేషన్ పనులను పరిశీలించిన కలెక్టర్

**- ప్రజాప్రతినిధులు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.**



కామారెడ్డి, మార్చి 13 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. అనంతరం సదాశివనగర్ - కుప్రియల్ హైవే ఇరుపక్కల జరుగుతున్న పరిశుభ్రత పనులను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. టెక్రియాల్ చెరువులో గణేష్, దుర్గాదేవి నిమజ్జనం జరిగిన ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శానిటేషన్ పనులు పూర్తి చేసి, ఈరోజు సాయంత్రం లోపు ఆ ప్రాంతాన్ని సమతలంగా చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని, ప్రజాప్రతినిధులు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, డీఎల్పీఓ శ్రీనివాస్, ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ చైర్పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్ కొత్తపల్లి లలితతో పాటు పంచాయతీ, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా తెలుగు సాహిత్య కవి జయంతి వేడుకలు

బాల్కొండ, మార్చి 13 ( మనం న్యూస్ ): పదహారవ శతాబ్దపు తెలుగు సాహిత్యపు కవి కుమ్మరి ముద్దుబిడ్డ మొల్లమాంబ జయంతి వేడుకలను పట్టణ కేంద్రంలోని శాలివాహన సంఘం భవనంలో అధ్యక్షుడు గొల్లపల్లి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ., సాధారణ కుటుంబంలో పుట్టిన మొల్ల మాంబ తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన గొప్ప కవి అని తెలిపారు. రామాయణం అందరూ చదవాలని సదుద్దేశంతో మొల్ల రామాయణం అనే గ్రంథాన్ని సరళమైన భాషలో రాసి విద్య ఎక్కువ లేకపోయినా పట్టుదల భక్తితో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన గొప్ప మహిళ అని తెలిపారు. పుట్టుకే కాదు ప్రతిభ మనల్ని గొప్ప వాళ్లని చేస్తుందని నిరూపించిన వీర వనిత ఆమెని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాగర్, సుఖేష్ సాయికుమార్, ప్రశాంత్, నిశాంత్, పురుషోత్తం, రాజేశ్వర్, శ్యామ్, రాములు, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు ఘన శ్రీకారం

**పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్.**



రెంజల్, మార్చి 13 ( మనం న్యూస్ ): రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (జీ రాం జీ ) పథకం కింద చేపట్టిన గ్రామాభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్ ఘనంగా శ్రీకారం చుట్టి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధిని వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ క్యాతం యోగేష్ మాట్లాడుతూ., గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో మేలుకలిగించేదని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సద్దాం, గ్రామ పెద్దలు, కార్మికులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## ఇందల్వాయిలో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం

ఇందల్వాయి, మార్చి 13 ( మనం న్యూస్ ): మండలంలోని ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి భారీ స్పందన వచ్చిందని డాక్టర్ షారోన్ సైనీ క్రిస్టినా వెల్లడించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో జిల్లా నుండి స్పెషలిస్ట్ డాక్టర్లు చికిత్స అందించడం జరిగిందనీ వివరించారు. ఎముకలు కీళ్ల వ్యాధి నిపుణులు (ఆర్థోపేడి క్ )కంటి వ్యాధి నిపుణులు (ఆప్తాల్మాలజీ), స్త్రీ వైద్య నిపుణులు (గైనకలజీ ), దంత వైద్య నిపుణులు (డెంటల్ )మరియు సాధారణ వ్యాధుల నిపుణులు (జనరల్ మెడిసిన్ ) వచ్చారనీ తెలిపారు. 311 మంది రోగులకు చికిత్స అందించడం జరిగిందనీ అన్నారు. ఎముకలు కీళ్ళు వ్యాధిగ్రాస్తులు 37, స్త్రీ వైద్య నిపుణులకు సంబంధించి 15, కంటి వ్యాదులు 24, చిన్నపిల్లలు 02, దంత సంబంధిత వ్యాదులు 7, జనరల్ వ్యాదులు 221, మహిళలందరికి అన్ని రకాల పరీక్షలు రక్తపరీక్షలు నిర్వహించారు. గర్భాశయ సంబంధిత వ్యాధులు మరియు క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వాటి పరీక్షలు చేయబడినవన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి వైద్యాధికారిని డాక్టర్ షారోణ్ షైని క్రిస్టినా వివరాలు వెల్లడించారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి మరియు ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ పి.ఓ డాక్టర్ వెంకటేష్ సందర్శించారు.





## బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు పరారు

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపిన పట్టణ సీఐ నరహరి.**

కామారెడ్డి, మార్చి 13 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలసదనం నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు మైనర్ బాలికలు పరారయ్యారు. ఇటీవల ప్రహరీ గోడను కూల్చి నూతనంగా నిర్మిస్తున్న నేపథ్యంలో గోడలో ఉన్న ఖాళీ మార్గం ద్వారా వారు బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాలసదనం సూపరిండెంట్ సంగమేశ్వరి తెలిపారు.



పోలీసులు ఏసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సిఐ నరహరి ప్రకటనలో తెలిపారు. కాగా ఇటీవల కామారెడ్డిలో మిస్సింగ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. వారం రోజుల క్రితం గోసంగి కాలనీకి చెందిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా బాలసదనం నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యం కావడం పట్టణంలో కలకలం రేపుతోంది.

# ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో ప్యాడ్ల వితరణ



బాల్కొండ, మార్చి 13 ( మనం న్యూస్ ): బాల్కొండ నియోజకవర్గం భీమ్గల్ మండలంలోని దేవక్కపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిజామాబాద్ జిల్లా ఎన్ ఎస్ యూ ఐ ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కృషి ఉంటే మనుషులు ఋషులౌతారని అన్నారు. పట్టుదలతో చదివితే విజయం మన దగ్గరికి వస్తుందని, పరీక్షలు అంటే భయపడద్దన్నారు. విద్యార్థులు కష్టపడి చదువును ఇష్టంగా మార్చుకొని చదివి పరీక్షల్లో మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యత దాగి ఉంటుంది. దాన్ని ఎవరైతే సరిగ్గా వినియోగించుకుంటారో వారే రేపటి రోజున ఉన్నత స్థానంలో నిలవగలరని చెప్పారు. విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటలల్లో కూడా ముందుండాలని అన్నారు. ఆటల్లో పాల్గొంటే మంచి ఆరోగ్యం పొందచ్చన్నారు. పదవ తరగతి లో మంచి మార్కులు పొంది, ఇంటర్ కోసం మంచి కాలేజీ లో జాయిన్ అయ్యి అక్కడ కూడా ఉన్నత ఫలితాలను రాబట్టి చరిత్ర సృష్టించాలని అన్నారు. విద్యార్థులు విద్యార్థి నాయకులు అయిన చేగువేరా, గోల్ మెడలిస్ట్ జార్జ్ రెడ్డి వంటి వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువుతో పాటు విద్యా హక్కు కోసం పోరాటం చేయాలని, మనకు అందని విద్యా ప్రయోజనాలను గురించి ఎక్కడి దాకైనా, ఎంతటి వారి దగ్గరికైనా వెళ్లి మనకు అందే హక్కు కోసం ప్రశ్నించి, సాధించుకోవాలని అన్నారు. రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవక్కపేట్ సర్పంచ్ మలావత్ పూజ అజయ్, బిట్టు భువన్ నిఖిల్ మరియు సందీప్ రాహుల్ ఘన రిషి ఆనంద్ రిషి పాల్గొన్నారు.



## హైవేలపై చెత్త వేస్తే కఠిన చర్యలు, భారీ జరిమాన

**- పంచాయతీలకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశం.**

కామారెడ్డి, మార్చి 13 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అడ్లూర్ - ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో అడ్లూర్ శివారులో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం తనిఖీ చేసి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. నేషనల్ హైవేపై ఉన్న డాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. హైవేపై ఉన్న అన్ని డాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి, సంబంధిత లైసెన్సులు ఉన్నాయా, నేషనల్ హైవే అధికారుల అనుమతులు తీసుకున్నారా అనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రయాణికులు, ప్రజలు నేషనల్ హైవేపై ప్లాస్టిక్, ఫుడ్ వ్యర్థాలు, పేపర్ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే హైవే వెంట ఉన్న డాబా హోటళ్లను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీవోలు సంయుక్తంగా తనిఖీ చేసి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదో పరిశీలించాలని ఆదేశించారు. హోటళ్ల నుంచి వచ్చే చెత్తను రోడ్డుపై వేస్తే సంబంధిత గ్రామపంచాయతీలు భారీ జరిమానాలు విధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## గన్నారం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

**- ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా.**

**- నలుగురు ప్రయాణికుల మృతి.**

ఇందల్వాయి, మార్చి 13 ( మనం న్యూస్ ): ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ మేరకు స్థానికులు ఇందల్వాయి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున గన్నరం గ్రామ శివారులో బ్రహ్మం గారి గుడి దగ్గరలో ఎన్ హెచ్ 44 రోడ్డుపై హైదరాబాద్ నుంచి అకోలా వెళుతున్న కురాణ ట్రావెల్స్ బస్సు అందజ రెండున్నర గంటలకు డ్రైవర్ అతివేగంగా, ఆ జాగ్రత్తగా బస్సుని నడపడం వలన బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్నటువంటి కాషన్ బోర్డ్ కి టక్కరించి రోడ్డుకు ఎడమవైపు దిగిపోయి బోల్తా కొట్టిందని ఎస్ఐ సందీప్ తెలిపారు. దీంతో బస్సులో ఉన్న ముగ్గురు ప్యాసింజర్స్ అక్కడికక్కడే చనిపోగా ఒకరు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొక వ్యక్తి మరణించారు. మిగతా 17 మంది ప్రయాణికులు కూడా గాయాలు కావడంతో ప్రస్తుతం హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ఇందులో నుండి మరో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఎస్ఐ సందీప్ తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సందీప్ తెలిపారు. ఘటన స్థలానికి అడిషనల్ డీసీపీ బస్వా రెడ్డి, నిజామాబాద్ ఎసిపి ప్రకాష్ యాదవ్ డిచ్పల్లి సిఐ వినోద్ సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు






## ధర్మారెడ్డి గ్రామంలో 8వ రోజు ప్రజాపాలన

నాగిరెడ్డిపేట్, మార్చ్ 13 ( మనం న్యూస్ ): నాగిరెడ్డిపేట మండలం ధర్మరెడ్డి గ్రామంలో ఎనిమిదవ రోజు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బోధన్ టు హైదరాబాద్ రోడ్డు చుట్టుపక్కల ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ బాటిల్స్ చెత్త సేకరించడం జరిగింది. మరియు గ్రామంలో ఇళ్లలో నీళ్లు నిలువ మురికి కాలువలు నిల్వ ఉండరాదని స్వచ్ఛమైన నీళ్లు తీసుకోవాలని కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆశా వర్కర్ సావిత్రి, వార్డు సభ్యులు సాయిబాబా గ్రామస్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ అభివృద్ధికి విరాళం



నాగిరెడ్డిపేట్, మార్చ్ 13 ( మనం న్యూస్): నాగిరెడ్డిపేటలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు ఉదారత చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాల పిడి సభాద్ కృష్ణ దంపతులు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 21,111 నగదును విరాళంగా అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు ఘనంగా అభినందించారు. భక్తులు దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## ఉచిత గాలికుంటు టీకాలు వేసిన మండలం పశువైద్యాధికారి

నిజాంసాగర్, మార్చి 13 ( మనం న్యూస్ ): శుక్రవారం నిజాంసాగర్ గ్రామంలో ఉచిత గాలికుంటు టీకాలు డాక్టర్ శృతిలయ ఆధ్వర్యంలో వేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శృతిలయ మాట్లాడుతూ., ప్రతి ఒక్క రైతు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గోపాలమిత్ర సిద్దు, కిరణ్, హకీమ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

